
# ఎప్పుడూ ఇంతే!

పి. శారద



గాంధీ భవనం సమీపంలో వున్న గవర్నమెంటు ప్రయిమరీ స్కూల్లో ఇంటర్వెల్ గంట మ్రోగింది. ఊదర పెట్టిన తేనెతుట్టె నుండి పారిపోతూ న్న తేనెటీగలలా భావిభారత పౌరులు బయటకు వచ్చారు. సినిమా పోస్టర్లు చూస్తూ, రోడ్డు మీద ట్రాఫిక్కును ఆటంకపరుస్తూ కొంత మంది పిల్లలు పచార్లు చేస్తున్నారు. మరి కొంతమంది పళ్లీలు, పచ్చి మిరపకాయ బజ్జీలు అమ్మేవాళ్ళ బండచుట్టూ మూగారు.

గోపీ మాత్రం విడిగా, ఒంటరిగా పేవుమెంటు మీద నిలబడి తన చొక్కా మాసికలను కప్పిపుచ్చుకోవాలని విఫలయత్నం చేస్తున్నాడు. దట్టంగా పెరిగిన జుట్టు తైలసంస్కారంలేక నొసటి మీద నాట్యంచేస్తూ అతని లేత ముఖానికి వింత శోభను చేకూరుస్తున్నది. అతని కళ్లు ఎంత విశాలంగా వున్నవో అంత వైరాగ్యాన్ని ప్రస్ఫుటంగా చాటుతున్నాయి.

గోపీ లాగుజేబులోకి చెయ్యి పోనిచ్చి తడుముతూ ఆలోచిస్తున్నాడు. అతని జేబులో పదిపైసల బిళ్ళ పదిలంగా వుంది. పళ్లీబండి వంక అతను ఆశగా, వాడిగా చూశాడు. పది సెకండ్లపాటు ఏదో గుణించుకున్నాడు. అతని కనురెప్పలు క్రిందకు వ్రాలినాయి. జేబులోని నాణేన్ని జేబులోనే జాగ్రత్త చేసి చెయ్యి బయటకు తీశాడు. వెనక్కు అడుగు వేశాడు. గంట మ్రోగింది.

పిల్లలందరితోపాటు తనూ చీమలా అడుగులో అడుగు వేసుకుంటూ స్కూలోకి వెళ్ళాడు గోపీ.

సాయంకాలం గంట కొట్టగానే గోపీ వాళ్ళ గూడెం ముఖం పట్టాడు. త్రోవలో అబిడ్సు సర్కిలులో నూతనంగా నెలకొన్న 'పద్మావతీ వేంకటేశ్వర వస్త్రాలయం' మీదుగా అతను రోజూ వెళుతుంటాడు. అతను స్కూల్లో చేరిన ఈ మూడేళ్ళనుండీ. కాని గత తొంభయిరోజులుగా అతను ఆ దారిన వెళ్ళడంలో విశేషముంది. 'పద్మావతీ వేంకటేశ్వర వస్త్రాలయం' షో కేసులో దుస్తులు ధరించి నిలబడ్డ ప్లాస్టిక్కు పిల్లవానికి గోపీకి ఈ తొంభయి రోజులుగా అవినాభావ సంబంధం ఏర్పడ్డది.

ప్లాస్టిక్కు పిల్లవానిని చూడకుండా గోపీ ఒక్క రోజైనా గడపలేదు. మొదటిసారిగా ఆ బొమ్మకు తొడిగిన చొక్కా చూచి గోపీ అనుకున్నాడు.

"అబ్బ! ఎంత బాగుంది! రాము తొడుక్కునే చొక్కా దీనిముందు బలాదూరు!"

ఆ క్షణంలో అతనిముఖం ముద్దమందార పూవులా వికసించింది. అతని కలువరేకుల కళ్ళల్లో విద్యుత్కాంతి ప్రసరించింది.

అంతులేని ఆనందంలో ఎన్నో క్షణాలు గడవక ముందే గోపీ 'ఈ చొక్కా ఖరీదు ఎంతవుంటుందో' అని ఆదుర్దా పడ్డాడు.

చొక్కాకు వ్రేలాడుతున్న చీటీ చదివాడు. తొమ్మిది రూపాయల తొంభయి పైసలు అని ముద్ర వేసివున్నది చీటీమీద.

ఆ రోజు అక్కడే షో కేసు ముందు నిలబడి గోపీ నోటిలెక్కలు వేశాడు.

ప్రతిరోజూ ఉదయము వాళ్ళ అమ్మ ఫ్యాక్టరీలో పనికి వెళుతూ గోపీని స్కూలుదగ్గర దిగడ్చి చిన్న టిఫిను క్యారియరు, పదిపైసల బిళ్ళ ఇస్తుంది. ఇలాంటి పదిపైసల బిళ్ళలు తొంబయి మూడు ప్రోగు చేసుకుంటే చాలు. ఇట్టే లెక్క తేల్చాడు గోపీ.

పది పైసలు పెట్టి గుప్పెడు పళ్లీలు కొనుక్కోక పోతే ఏం? పళ్లీలు తినటం వొంటికిమంచిది కాదని మాష్టారు చెప్పారుగూడాను? అమ్మ ఇచ్చిన టిఫిను క్యారియరులోని అన్నం కమ్మగా తిని, కొళాయి నీళ్ళు తాగితే చల్లగా ఉంటుంది. రోజూ యిలా పది పైసలు చొప్పున మిగిల్చితే ఎంత మంచి చొక్కా కొనుక్కోవచ్చు!

శేఖర్ తన చొక్కా చిరుగు ఎంత చిన్నదైనా చూచి అందులో పెన్సిలు పెట్టి ఆడిస్తూంటాడు. సుధాకర్ కాగితం ముక్కకు ఉమ్మి రాసి తన చొక్కాకు అంటించుతూంటాడు.

హాం! ఈ చొక్కా కొనుక్కుని నేను తొడుక్కుంటే వాళ్ళందరిని ఎగతాళి చెయ్యొచ్చు......

ఇలా అనుకుంటూ గోపీ తొంభయి రోజులు గడిపాడు.

ఇవాళ తొంభయి ఒకటవ రోజు. ఆ చొక్కా ఆ బొమ్మకు అలాగే తొడిగి వున్నదని గట్టి నమ్మకం కుదిరేదాకమాని ఇంటికి వెళ్ళాడు గోపీ.

ఇంట్లో ముంతలో ఇవాల్టి పది పైసలు వడేసి హాయిగా అమ్మ ప్రక్కలో పడుకుని తీయని కలలు కంటూ నిద్రపోయాడు గోపీ.

మూడో రోజు శుక్రవారం. చాలా మంచిరోజు అంటారు.

ఉత్సాహంగా గోపీని బాళ్ళ అమ్మ స్కూలు దగ్గర దింపెట్టింది.

గోపీ స్కూలుకు ఎగనామం పెట్టాడు.

ఉప్పనగా పండిన చేలో కుప్పనూర్చిన రైతులా పరమ సంతోషంతో గోపీ తొమ్మిది రూపాయల ముప్ఫయి పైసలు చేత బుచ్చుకున్నాడు. 'పద్మావతీ వేంకటేశ్వర వస్త్రాలయం'లో అడుగు పెట్టాడు.

వస్త్రాలయంలో నేల్సుమన్ను వంక ఎగాదిగా చూచాడు గోపీ.

ఏమిటిది. మన వస్త్రాలయంలోకి రావటమేమిటి? అని నేల్సుమన్ను కూడా గోపీ వంక ఎగాదిగా చూచాడు.

గోపీ తన మనస్సుకు నచ్చిన సేల్సుమను దగ్గరకు వెళ్ళాడు. చిన్న వయస్సులోనే ఆ సేల్సుమనుకు బట్టతల వచ్చేసింది. బుగ్గలు జారిపోయి నయి. కళ్ళు లోతుకు క్రుంగి పోయినాయి.

"ఏమండీ! ఆ బొమ్మకు తొడిగిన చొక్కా నాక్కావాలండీ!" అంటూ గుటకలు మ్రింగుతూ షో కేసులోని బొమ్మను చూపించాడు గోపీ.

సేల్సుమనుకు హాశ్చర్యమన్నది. అతనిలో ఎందుకో ఏదో ఆందోళన, ఆవేదన బయల్దేరినాయి. ముఖంమీద మాత్రం నవ్వు తెచ్చిపెట్టుకున్నాడు.

"అహా! ఆ చొక్కా అంతగా నచ్చిందా నీకు...ఇదిగో, అలాంటి చొక్కాయే బీరువాలో నుండి తీసిస్తాను" అన్నాడు సేల్సుమను.

"కాదండీ! నాకా చొక్కాయే కావాలండి! ఏమండీ! చాలా రోజులనుండీ అనుకుంటున్నానండీ!" అని బతిమలాడాడు గోపీ.

"ఉహూ!" ఈసారి నిజమైన చిరునవ్వుతో, తెలియరాని సంతృప్తితో సేల్సుమను బీరువాలోని ఒక చొక్కా తీసుకుని షోకేసు దగ్గరకు వెళ్లాడు.

గాజు తలుపులు తెరచి ప్లాస్టిక్కు పిల్లవాని చొక్కా విప్పి, వాడికి తను తెచ్చిన కొత్తచొక్కా తొడిగాడు. వాడి పాత చొక్కా గోపీకి కొత్త చొక్కాయే కాదు కోటిరూపాయల విలువ గల వస్తువు!

సేల్సుమను తిరిగి తన టేబిలు దగ్గరకు వచ్చి గోపీ కోరుకున్న చొక్కాను చక్కగా మడతవేసి ప్లాస్టిక్కు కవరులో పెట్టాడు.

"డబ్బులివ్వు బాబూ, బిల్లు వ్రాస్తాను" అన్నాడు సేల్సుమను.

విజయగర్వంతో గోపీ తొంభయిమూడు పది పైసల బిళ్ళలను బల్లమీద పోశాడు.

సేల్సుమను చిరునవ్వుతో ఎంచటం మొదలెట్టాడు. ఎంచటం పూర్తికాగానే అతనిముఖం వెలవెల పోయింది.

"బాబూ! ఈ చొక్కా ఖరీదు పదిరూపాయల యాభయి పైసలు. నువ్వు ఇచ్చింది తొమ్మిదిరూపాయల ముప్ఫయి పైసలే! ఇంకా ఒక రూపాయ ఇరవయి పైసలు కావాలి"

గోపీ నివ్వెర పోయాడు.

సేల్సుమను చెప్పరాని ఆవేదనను అణచుకుంటున్నాడు.

"ఏమండీ! నేను బాగా గుర్తుపెట్టుకున్నాను. ఆ చొక్కా ఖరీదు తొమ్మిది రూపాయల ముప్ఫయి పైసలేనండీ! కావాలంటే చూడండి. నా లెక్కల నోటుబుక్కులో మొదటిపేజీలో వ్రాసుకున్నాను. గూడా." అంటూ ఆశగాచూస్తూ లెక్కల నోటు బుక్కును బల్లమీద పెట్టాడు గోపీ.

సేల్సుమను చెవులలో ఆవిరి బయల్దేరింది.

"అవునుబాబూ! నువ్వుచెప్పినమాట ఒకప్పుడు నిజమే. ఆ బొమ్మకు ఆ చొక్కా తొడిగినరోజున ఆ చొక్కా ఖరీదు నువ్వు చెప్పినంతే. కాని ధరలు ఎప్పుడూ నిలబడి వుండవు. రోజురోజుకూ పెరుగుతూంటాయి గదా?" గోపీ మనస్సు నొప్పుకోకుండా ఉండాలని ఉబలాట పడుతూ ఇంకా వివరించాడు సేల్సుమను.

గోపీకి అర్థం కాలేదు, గణితబోధినిలోని ఎక్కాలు పైనుండీ క్రిందికి, క్రిందినుండీ పైకి వల్లెవేసినా అర్థం కాలేదు. ఈ ఆర్థిక శాస్త్ర రహస్యం.

"ఏమండీ! నాకు తెలియదండి! ఎలాగైనా సరే నాకా చొక్కా ఇచ్చెయ్యండి. మీకు దణ్ణం పెడతాను." ముందుకు అడుగువేసి మరీ ప్రాధేయపడ్డాడు గోపీ.

గోపీ కళ్ళు చెమ్మగిల్లి మెరుస్తున్నాయి.

సేల్సుమను మొహం చిన్నబోయింది.

"లేదు బాబూ! అలా తక్కువ ధరకు అమ్మితే శేఠ్ నిన్నూ, నన్నూ బయటకు గెంటుతాడు... మరేమో నువ్వు ఇంటికి వెళ్ళి మీ అమ్మ నడిగి మరో రూపాయి ఇరవై పైసలు పట్టుకురా. అందాకా ఈ చొక్కా నీకోసం ఇక్కడే అట్టి పెడతాను. సరేనా!" అంటూ సేల్సుమను జాలిగా గోపీ మొహంలోకి చూచాడు.

గోపీ రెండు కళ్ళనుండీ రెండు మంచి ముత్యాలు రాలి పాలరాతి గచ్చుమీద పడ్డాయి.

సేల్సుమను గుండెలు కొలిమి తిత్తులలా కొట్టుకున్నాయి. అతని మనస్సు పాలరాతి మీద వ్యాపించిన కన్నీటి బిందువుల మీద లగ్నమైపోయింది...

ఆ రోజు శుక్రవారం. అప్పుడు తనకు ఎనిమిదేళ్ళు వుంటాయేమో! పక్షిటూళ్ళో పెరుగుతున్న రోజులవి. అమ్మ పెరట్లో పెంచిన కూరగాయలన్నీ కోసి మూటగట్టి సంతలో అమ్ముకొనడానికి మోసుకెళుతూంటె తనూ వెంటబడ్డాడు. తనకు ప్రియమైన వస్తువును ఆ రోజు సంతలో ఎలాగైనా కొనుక్కోవాలని ఉబలాటపడ్డాడు. సంతలో కూరగాయలన్నీ అర్థగంటలో అమ్ముడుపోయినాయి. అమ్మో! ఎన్ని డబ్బులున్నాయి అమ్మదగ్గర! ఇవాళ ఎలాగైన సరే అమ్మ చేత రబ్బరు బూట్లు కొనిపించుకోవాలి. మనసులోని మాట అమ్మకు చెప్పాడు అతి గారాబంగా.

"ఎందీ! నువేం మారాజు కడుపున పుట్టినావా ఎదవా" అని అమ్మ కస్సు ఎర్ర జేసింది.

తను మూతి ఇంకా గట్టిగా బిగించి మారాము చేశాడు. రబ్బరు బూట్లు కొనిస్తేతప్ప యింటికి నడవనని రోడ్డుకు అడ్డంపడ్డాడు. అమ్మ ఏడ్చింది. గుండెలు బాదుకుంది. తను మాత్రం అడుగుతీసి అడుగు వేయలేదు. చివరకు రోడ్డుమీద దొరికిన చొప్పదంటుతో బాదింది. తనను ఎన్ని దెబ్బలు కొట్టిందో అన్ని ఎక్కిళ్ళుపెట్టి ఏడ్చింది అమ్మ. చంకనేసుకుని ఇంటికి తీసుకొచ్చింది.....

సేల్సుమను బరువుగా నిశ్వాస విడిచాడు. అతను అంతవరకూ చూస్తున్న కన్నీటి బిందువులు ఆవిరి అయిపోయినాయి.

తలెత్తి చూచాడు సేల్సుమను. కన్నీటి బిందువులతో పాటు గోపీ అదృశ్యమైనాడు.

సేల్సుమను షాపులో నుండి రోడ్డు మీదకు పరుగెత్తుకొచ్చాడు. వచ్చే కార్లు, పొయ్యే కార్లు, రణగొణ ధ్వనితో రిక్షాలు, సైకిళ్ళు — వీటిని తప్పించుకుంటూ ఎడతెరిపి లేకుండా తిరిగే జనం! ఊరూ పేరూ లేని అబ్బాయిని ఏమని పిలవాలి? ఎట్లా పిలవాలి?

★

